క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి, కుతుకులూరు, అనపర్తి పాతవూరుల్లో గల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఈనెల 23వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ దుప్పలపూడి, అనపర్తి ఇందిరానగర్, మార్కండేయపురం, మెయిన్‌రోడ్డు, శేషగిరిరావుపేట, కెనాల్ రోడ్, ధరణికోట, పాతవూరు, కొప్పవరం, లక్ష్మీనరసాపురం, మహేంద్రవాడ, రామవరం, పాలమూరు, పులుగుర్త, కుతుకులూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు.

బహుమతిగా కాసు బంగారం


విజేత ప్రసాద్‌కు బహుమతి అందజేసిన అనకాపల్లి శ్రీను తదితరులు

పెదపూడి: జి.మామిడాడలో శ్రీసూర్యనారాయణ మూర్తి స్వామివారి కల్యాణం సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి జరిగిన బాణసంచా పోటీల్లో విజేతకు కాసు బంగారం బహుమతిగా అందించారు. కరప ప్రసాద్, పందలపాక గోవిందు జట్ల మధ్య ఉత్కంఠగా సాగిన బాణసంచా పోటీలో 15 మార్కుల తేడాతో కరప ప్రసాద్ విజేతగా నిలిచాడు. విజేతకు ప్రముఖ వ్యాపారవేత్త ఎస్‌వీఎస్ఎస్‌రెడ్డి(అనకాపల్లి శ్రీను) కాసు బంగారం అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సత్తి భగవాన్‌రెడ్డి, ద్వారంపూడి తేజారెడ్డి, కర్రి గంగాధర్‌రెడ్డి, లక్ష్మణరావు వ్యవహరించారు. కార్యక్రమంలో కొవ్వూరి వీర్రాఘవరెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మేడపాటి అమ్మిరెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, సత్తి నానిరెడ్డి, పప్పు చిన్నారెడ్డి, ద్వారంపూడి బంగారరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యురాలి మృతి


అంచూరి సత్యవతి(ఫైల్)

రంగంపేట: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అంచూరి చినసత్యనారాయణ సతీమణి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అంచూరి సత్యవతి(50) అనారోగ్య కారణాల వల్ల బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సానుభూతిని తెలియజేశారు. సంతాపం తెలిపినవారిలో మాగాపు వెంకటరమణ, అంచూరి శ్రీను, ఏసుబాబు, బోడెం విష్ణు, లాజరు తదితరులున్నారు.

డాక్టర్ రమేష్‌బాబుకు సత్కారం


రమేష్‌బాబును సన్మానిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన డాక్టర్ సత్యం రమేష్‌బాబును రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బుధవారం సత్కరించారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరి కళా దర్బార్ జాతీయ ప్రతిభ పురస్కారోత్సవం డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో వైద్యపరంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన డాక్టర్ సత్యం రమేష్‌బాబును మంత్రి సన్మానించారు.

కొనసాగుతున్న ఉపవాస దీక్షలు

మధురపూడి: క్రైస్తవుల ఉపవాస దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 14న ప్రారంభమైన ఈ కార్యక్రమం బుధవారానికి వారం రోజులు పూర్తయ్యింది. కోరుకొండ ఎస్సార్ నగర్, బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవుల ఆరాధ్య దైవం క్రీస్తు శ్రమలను అనుభవించి, సిలువపై మరణించి, తిరిగి పునరుత్థానమైన రోజులను పురస్కరించుకుని 40 రోజుల పాటు శ్రమల కాలాన్ని నిర్వహిస్తారు.

సమష్టి కృషితో క్షయ వ్యాధి నివారణ

అనపర్తి: సమష్టి కృషితో క్షయ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. బుధవారం మండలంలోని పీరారామచంద్రపురంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ వసుంధర మాట్లాడుతూ మండలంలోని రామవరం, పీరారామచంద్రపురం గ్రామపంచాయతీలు టీబీ ముక్త్ గ్రామ పంచాయతీలుగా ఎంపికై నట్లు చెప్పారు. టీబీ నివారణకు అందుబాటులో ఉన్న వైద్య విధానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం ద్వారా టీబీ వ్యాధి నుంచి విముక్తులయ్యే అవకాశం ఉందన్నారు. క్షయ రహిత సమాజ స్థాపనకు వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దీప్తి పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు జీవం

- జగనన్న పాల వెల్లువతో మేలు
- మహిళలకు ఆర్థిక చేయూత


శ్రీరంగపట్నంలో పాడి పశువులకు గ్రాసాన్ని అందిస్తున్న రైతు

మధురపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పాడి-పంటలతో ప్రతి పల్లె కళకళలాడుతోంది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పాడి పరిశ్రమకు జీవం వచ్చింది. పాడి రైతులకు ఆదాయ వనరులను కల్పించే లక్ష్యంతో 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇది వారి ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడుతోంది. గుజరాత్ రాష్ట్రం అమూల్ సహకార డైరీ ఆధ్వర్యంలో పాడి రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. అలాగే మహిళా పాడి రైతులతో సహకార సంఘాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పరిశ్రమ ద్వారా వారి ఆర్థిక స్థితిని పెంపొందించడానికి బాటలు వేస్తోంది. దీనికి అనుగుణంగా పాలవెల్లువ సర్వే జోరుగా సాగుతోంది. రాజానగరం నియోజకవర్గంలోని గ్రామాల్లో పాడి రైతులు, పాల దిగుబడి తదితర వివరాలతో కూడిన సర్వేను వలంటీర్ల ద్వారా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 75 శాతం సర్వే పూర్తయ్యింది. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 19,565 ఆవులు, 44,076 గేదెలు ఉన్నాయి. జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రజా సంకల్పయాత్రలో పాడి రైతులకు జగనన్న ఇచ్చిన హామీ మేరకు పాలవెల్లువ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. ఇందులో భాగంగా పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తద్వారా వారి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

పాడి పశువుల సంరక్షణ కోసం రైతులు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. పాడి పశువుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు చూసుకోవాలి. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా పాల ఉత్పాదకత తగ్గుతోంది. పాడి పశువుల సంరక్షణలో భాగంగా మేలుకరమైన ఆహారాన్ని అందించాలి. సమీకృత దాణా ఇవ్వాలి. మంచి పశుగ్రాసం, దాణాను ఇవ్వడం ద్వారానే పాల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతోంది. రెండున్నర లీటర్ల పాలిచ్చే ప్రతి పశువుకు, ఒక కిలో దాణా అందించడం ద్వారా మంచి ఫలితాలొస్తాయి. పాల దిగుబడితో పాటు పాలల్లో నాణ్యత పెరుగుతోంది. పాడి పశువులకు సరిపడినంత మంచి పశుగ్రాసాన్ని, సమీకృత దాణాను అందించడం అన్నివిధాలా శ్రేయస్కరం.

> **పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి**
>
> 
>
> ఎండలో మధ్యాహ్నం వేళల్లో కాకుండా ఉష్ణోగ్రత తక్కువ సమయాల్లో పశువులను మేతకు తీసుకెళ్లాలి. ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత అయితే మంచిది. పశువుల శాలల్లో చల్లగా ఉండేలా చూసుకోవాలి. తగినంత నీటిని అందుబాటులో ఉంచాలి. పశువుల శాలల చుట్టూ చెట్లు ఉండటం ఉపయోగకరం. గేదెలను చెరువుల్లోకి దింపడం, నీటితో తడపడం చేయాలి.
>
> –పి.ప్రభావతి, ఏడీ, పశుసంవర్ధక శాఖ

పాల ధరలు ఇలా..

జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో అమూల్ సంస్థ సహకారంతో నిర్వహించే కేంద్రాల ద్వారా పాల వెన్నశాతం ఆధారంగా ధర నిర్ణయిస్తారు. వెన్నశాతం అధికంగా ఉన్న గేదె పాలు లీటరు రూ.88, వెన్నశాతం తక్కువగా ఉన్న పాలకు రూ.43 అందజేస్తున్నారు. అలాగే ఆవు పాలు లీటరుకు రూ.48 నుంచి రూ.35 వరకూ రైతులకు ఇస్తున్నారు. పాడి రైతులకు నేరుగా నగదు అందజేస్తున్నారు. భవిష్యత్తు తరాల పిల్లలకు మంచి ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో అమూల్ సంస్థ నిర్వహణలో పాల కేంద్రాలు నిర్వహిస్తున్నారు.

ఎన్నికల విధులు నిబంధనల ప్రకారం చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బీఎల్‌వోలు, ఇతర అధికారులు ఎన్నికల విధులను నిబంధనల ప్రకారం చేపట్టాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలు, ఇతర అధికారులకు బూత్‌ల్లో ఉండాల్సిన సౌకర్యాలు, ఎన్నికల విధుల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు బీఎల్‌వోలతో బూత్‌ల్లో సౌకర్యాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏఓ మణిదీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చలమయ్య, ఎంఈఓ-2 సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే సమగ్రాభివృద్ధి


వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన బలభద్రపురం గ్రామంలో రూ.62.05 లక్షల పైకా నిధులతో వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ఆడుదాం ఆంధ్రా ద్వారా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న ఎందరో క్రీడాకారులకు ఈ క్రీడా స్థలాలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, శాప్ డైరెక్టర్ గుబ్బల అలేఖ్య, ఎంపీటీసీలు మేడపాటి ఆనందరెడ్డి, మండల వ్యవసాయ సలహాదారుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు


డిజిటల్ మేళాలో ప్రదర్శించిన ప్రాజెక్ట్ గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న విద్యార్థి

అనపర్తి: సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకుని అత్యుత్తమ ప్రయోగాల ద్వారా విద్యార్థులు దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తేతలి రామిరెడ్డి మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో ఏర్పాటుచేసిన డిజిటల్ మేళాను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి అభివృద్ధికి సైన్స్ మూలమని, సైన్స్‌తోనే జీవితం ముడిపడి ఉందన్నారు. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు దోహదం చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రాజెక్టుల పనితీరు, ఉపయోగాలను ఎమ్మెల్యేకు వివరించారు. అత్యుత్తమ ప్రయోగాల ద్వారా తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. డిజిటల్ మేళాలో అనపర్తి, రాయవరం, బిక్కవోలు, మండపేట మండలాల పరిధిలోని సుమారు 25 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, గండి వాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభాషపై ఉదాసీనత ప్రమాదకరం

సీతానగరం: మాతృభాషపై ఉదాసీనత అత్యంత ప్రమాదకరమని ప్రముఖ కవి, రాష్ట్ర ప్రభుత్వ గిడుగు రామ్మూర్తి పంతులు అవార్డు గ్రహీత, తెలుగు భాషాభివృద్ధి సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూటం స్వామి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన తెలుగుశాఖాధిపతి డాక్టర్ సుధామయి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ స్వామి మాట్లాడుతూ పిల్లల పరిపూర్ణ మానసిక వికాసానికి మాతృభాషా పరిజ్ఞానం పునాది లాంటిదన్నారు. మాతృభాషకు ఎంత దగ్గరగా ఉంటాయో మనసు అంత ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రపంచంలో ఆరు వేల ఆరు వందల భాషలు ఉన్నాయని, ఏ భాషకు ఆ భాష ప్రత్యేక సంస్కృతీ సంప్రదాయాలు ఉన్నాయన్నారు. మన జీవ వైవిధ్యాన్ని కాపాడేవి మాతృభాషలే అని ఉద్ఘాటించారు. మాతృభాషను ప్రేమించాలని, పరభాషలను గౌరవించాలని అన్నారు. అనంతరం వివిధ కవులు రాసిన పద్యాలు, వచన కవితలను వినిపించి ఉత్సాహపరిచారు. అనంతరం డాక్టర్ స్వామిని ఘనంగా సన్మానించారు.

కన్నుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠాపన


సీతానగరం సీతారామాలయం వద్ద ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: సీతానగరంలో పునర్నిర్మించిన రామాలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో హనుమత్, లక్ష్మణ, సీతా సమేత శ్రీరామచంద్రమూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠాపనల మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. కగనర్ల వెంకప్ప శ్రేష్ఠ, అన్నపూర్ణ, కుసుమంచి వీర్రాజు, మహాలక్ష్మి కస్తూరి దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముందుగా ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించిన అనంతరం శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు ఆరాధ్యుల రమేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు ఆలయాలను టి.టి.డి శ్రీవారి శ్రీవాణి ట్రస్ట్ సౌజన్యంతో అభివృద్ధి చేస్తున్నామని, ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. సీతానగరంలో రామాలయాన్ని రూ.60 లక్షల సీజీఎఫ్ గ్రాంటులతో అభివృద్ధి చేశామన్నారు. కోరుకొండ మండలం గరగంపాలెం, రాజానగరం మండలం సంపత్ నగరంలలో సీతారాముల ఆలయాల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున శ్రీవాణి ట్రస్ట్ ద్వారా కేటాయించామన్నారు. నియోజకవర్గంలో సుమారు 117 ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. 144 అడుగుల ఎత్తయిన శ్రీఆంజనేయస్వామి వారి విగ్రహంతో పాటు కోరుకొండలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణానికి చర్యలు చేపట్టామని విజయలక్ష్మి వివరించారు. గరగపాలెం, సంపత్‌నగర్‌లలోని రామాలయాలను సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద జక్కంపూడి విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. సీతానగరంలో జరిగిన అన్నసమారాధనలో ఐదు వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, ఆర్యవైశ్యులు కనగర్ల రమణ గుప్త, పువ్వాడ కృష్ణ, కొత్త నగేష్, కనగర్ల నరసింహమూర్తి, కటకం శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: సంపత్‌నగరంలో నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ పి.రామకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం కోల్పోతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి


రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి


అనపర్తి: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రోజురోజుకూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి ఇటీవల ఒక టీవీ చానల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో 2019 ఎన్నికల్లో తన ఘోర ఓటమిని కులపిచ్చిగా పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తన ఓటమికి కులపిచ్చే కారణమన్న రామకృష్ణారెడ్డిని రెడ్డి కులద్రోహిగా జాతి భావిస్తోందన్నారు. ఆయన రెడ్డి జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన తన పదవీకాలంలో ఫైనాన్స్ వ్యాపారస్తులను కాల్‌మనీ పేరుతో వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. రామకృష్ణారెడ్డి తన పాలనలో సాగించిన అవినీతి పనులతో తన తండ్రి నల్లమిల్లి మూలారెడ్డి వారసత్వానికి తూట్లు పొడిచారని దుయ్యబట్టారు. రెడ్డి జాతి అభిమానాన్ని కులపిచ్చిగా వక్రీకరించిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లికి వచ్చే ఎన్నికల్లో రెడ్డి కులస్తులు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

నేడు ఎమ్మెల్యే రాజా పర్యటన ఇలా..

రాజానగరం: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మండలంలో గురువారం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 8.30 గంటలకు ముక్కినాడపాకలులో ఓహెచ్ఆర్ పనులకు శంకుస్థాపన చేసి, అనంతరం అక్కడ నిర్మించిన బల్క్‌మిల్క్ చిల్లింగ్ యూనిట్, ఎస్సీ కమ్యూనిటీ హాలు, ఓహెచ్ఆర్‌ను ప్రారంభిస్తారు. తర్వాత ఆ గ్రామంలోనే శివాలయానికి శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10 గంటలకు మల్లంపూడి చేరుకుని ఓహెచ్ఆర్ శంకుస్థాపన, నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనానికి ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం 11 గంటలకు అదే గ్రామంలో నివాస స్థలాల కోసం సేకరించిన భూమిలో కొత్తతుంగపాడుకు చెందిన లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తారు. 11.30 గంటలకు కొండగుంటూరు, మధ్యాహ్నం 2.30 గంటలకు జి.యర్రంపాలెంలో అర్హులకు ఇళ్ల స్థలాలను ఎమ్మెల్యే పంపిణీ చేస్తారు. సాయంత్రం 4 గంటలకు జేగురుపాడులో ఏర్పాటు చేసిన దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు, వంగవీటి రంగాల విగ్రహాలను ఆవిష్కరిస్తారు.

ఘనంగా సోమేశ్వరస్వామి కల్యాణం


సోమేశ్వరస్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


నంది వెంకన్న కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు


వడిశలేరులో భజేనారాయణస్వామికి తలంబ్రాలు పోస్తున్న అర్చకులు


ధ్వజ స్తంభాన్ని ఊరేగిస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీపార్వతీ సమేత సోమేశ్వరస్వామివారి వార్షిక కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమాళ్లపల్లి మల్లేశ్వర శర్మ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ గండి నాగ వెంకటరమణ, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్‌రెడ్డి, శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్‌లు కర్రి ఇన్నారెడ్డి, పాలచర్ల వీర వెంక సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నంది వెంకన్నస్వామి కల్యాణం

పెదపూడి: మండలంలోని పెదపూడి ఊర చెరువు వద్ద నంది వెంకన్న కల్యాణం బుధవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకుడు సీహెచ్ఆర్ కాశ్యపు శర్మ కల్యాణ క్రతువులు నిర్వహించారు.

కన్నుల పండువగా భజేనారాయణస్వామి కల్యాణం

రంగంపేట: మండలంలోని వడిశలేరులో కొలువైయున్న శ్రీదేవి భూదేవి సమేత భజేనారాయణస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం మంగళవారం రాత్రి అంగరంగం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు, వంగల శ్రీనివాసాచార్యులుచే కల్యాణం కన్నుల పండువగా సాగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ముమ్మన రాంబాబురెడ్డి, ఆలయ చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు చేతుల మీదుగా దేవస్థానం తరపున స్వామి, అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలు, మట్టెలు, మంగళ సూత్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. కల్యాణానికి హాజరైన మహిళలకు దేవస్థానం తరపున పసుపు, కుంకుమ, తాంబూలం అందించారు. కల్యాణం సందర్భంగా జగ్గంపేట సీతారత్న లలితకళా నృత్యనికేతన్ నాట్య మండలికి చెందిన 11 మంది బాలికలచే భరతనాట్య నత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం నత్యం చేసిన బాలికలకు ఆలయ కార్యనిర్వహణాధికారి రాంబాబు, చైర్మన్ వీర్రాజులు మెమొంటోలు అందించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త వల్లూరి సూర్యభాస్కరరావు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ఊరేగింపు

పెదపూడి: జి.మామిడాడ గ్రామం పాటి మీద నూతన ధ్వజ స్తంభం ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభం పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న సంకల్ప పూజల్లో భాగంగా గ్రామంలో ధ్వజ స్తంభాన్ని ఊరేగించారు. భీమేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రారంభమై జమ్ముల, ద్వారంపూడి వారి వీధుల మీదుగా స్వర్ణమయి అపార్ట్‌మెంటు, అక్కడి నుంచి తిరిగి ఆలయం వరకూ ఊరేగింపు సాగింది. భక్తులు పసుపు నీళ్లు చల్లి హారతులిచ్చారు. జి.మామిడాడతో పాటు పెద్దాడ, గండ్రేడు, పైన, రాజుపాలెం, చింతపల్లి, బిక్కవోలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం జయప్రదం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.